భవానీమాతాకీ జై..









భవానీల దీక్ష విరమణతో దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం రద్దీగా మారింది. రాష్ట్రం నలుమూలల నుంచి గురువారం రెండో రోజు వేలాది మంది భవానీలు తరలివచ్చి ఇరుముడులు సమర్పించి దీక్షలు విరమించారు. చిన్నారులు సైతం ఇరుముడులతో కొండకి చేరుకున్నారు. భవానీమాతాకి జై అంటూ దీక్షాపరులు అమ్మవారిని స్మరించుకున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

శ్రీదత్తసాయి మందిరంలో బాబా పారాయణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో నూతన సంవత్సరం తొలి గురువారం పురస్కరించుకుని లోక కల్యాణార్థం శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన బాబా పారాయణం జరిగింది. తెల్లవారుజాము నుంచి నిర్విరామంగా పారాయణం నిర్వహించారు. బాబాకు విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహించి మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్ళమూడి వీర మోహనరావు పర్యవేక్షించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో గురువారం హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పరీక్షా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక మాట్లాడుతూ విద్యార్థులకు తమ వంతు సామాజిక బాధ్యతగా నోట్ పుస్తకాలు, పరీక్షా సామాగ్రి అందజేస్తున్నామని పేర్కొన్నారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ట్రస్టీలు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

న్యూటన్ పోస్టర్ ఆవిష్కరణ



పాయకాపురం(విజయవాడరూరల్): సర్ ఐజాక్ న్యూటన్ ఇన్నోవేషన్స్‌పై పోస్టర్ ప్రజెంటేషన్‌కు సంబంధించిన అవగాహన కార్యక్రమం పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ మాట్లాడుతూ న్యూటన్ ఆవిష్కరించిన ఆవిష్కరణలు, వాటి ఉపయోగాలు, ఫార్ములాలను విద్యార్థులకు వివరించారు. యాంత్రికశక్తి, బలం, గురుత్వాకర్షణ, వాటి మీద రాకెట్ ప్రయోగాల నియమం వంటి అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. వీటితో పాటు న్యూటన్ తయారు చేసిన అనేక నమూనాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి విద్యార్థులకు అందజేశారు.

రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ డైరెక్టర్‌గా జ్యోతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ డైరెక్టర్‌గా కసగోని జ్యోతి నియమితులయ్యారు. కృష్ణలంక, 21వ డివిజన్‌కు చెందిన ఈమెను ప్రభుత్వం రెండోసారి డైరెక్టర్‌గా నియమించింది. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి డైరెక్టర్ పదవిలో నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌కు, పార్టీ పెద్దలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వెనుకబడిన వర్గాల ప్రజలను, మహిళలను చైతన్య పరిచి పార్టీ గెలుపునకు తన వంతు బాధ్యతగా కృషి చేస్తానన్నారు.

మహిళల జీవనోపాధిపై అవగాహన

భవానీపురం(విజయవాడపశ్చిమ): చైల్డ్ ఫండ్ ఇండియ హెచ్‌ఎస్‌బీసీ సహకారంతో విజయవాడ అర్బన్ ప్రాంతాలైన వాంబేకాలనీ, న్యూ రాజరాజేశ్వరిపేట, వైఎస్సార్ కాలనీ, కండ్రికలలోని మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా జీవనోపాధి పొందేందుకు గురువారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న సుమారు 1210 మంది మహిళలకు రూ.12 వేలు చొప్పున అందచేసి చిరువ్యాపారాలు చేసుకునేందుకు సహకరించారు. వారి వ్యాపారాభివృద్ధి కోసం నిర్వహించిన 18 రోజుల శిక్షణలో వ్యాపార పరిజ్ఞానం, నెట్ వర్కింగ్, లింకేజీలు అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షకులు మంజూషా, అశ్విని, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం నగర యువజన అధ్యక్షుడిగా హరీష్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం యువజన విభాగం విజయవాడ నగర అధ్యక్షుడిగా సింగ్‌నగర్‌కు చెందిన ఏపీ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం కోశాధికారి చిట్టూరి హరీష్ ఎంపికయ్యారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్ ఆధ్వర్యాన నగరంలో జరిగిన బీసీ కులాల సమావేశానికి విచ్చేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని హరీష్‌కు అందించారు. తనకు యువజన విభాగ బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర అధ్యక్షులకు హరీష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అవ్వాతాతలకు అండగా జగనన్న



పింఛన్లు పంపిణీ చేస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, నాయకులు



పింఛన్లు అందజేస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండంత అండగా నిలుస్తున్నారని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ అన్నారు. 58, 60, 61వ డివిజన్లకు సంబంధించి నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం సింగ్‌నగర్ షాదీఖానాలో గురువారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ జగనన్న ఎన్నికల ముందు చెప్పినట్టుగానే వైఎస్సార్ పింఛన్ కానుకను రెండు వేల నుంచి మూడు వేల రూపాయలకు పెంచుకుంటూ రావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. గతంలో రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడి అవస్థలు పడాల్సి వచ్చేదని, జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత నేరుగా పింఛన్‌ను ఇంటికి వచ్చి అందిస్తున్నారని చెప్పారు. పింఛన్‌దారులంతా సీఎం జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి వెంకట్రావు, బెవర నారాయణ, కార్పొరేషన్ యూసీడీ విభాగం అధికారులు, పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

59వ డివిజన్‌లో..

59వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్‌దారులకు చేస్తున్న కృషిని వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.3 వేలకు పెంచిన గొప్ప నాయకుడు జగనన్న అని అన్నారు. జగనన్న వెంటే రాష్ట్ర ప్రజలంతా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఎండీ హాఫీజుల్లా తదితరులు పాల్గొన్నారు.

గడప వద్దకే పింఛన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): అర్హతే ప్రామాణికంగా గడప వద్దకే పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి కోరారు. స్థానిక 30వ డివిజన్‌లో నూతనంగా మంజూరు చేసిన 30 పింఛన్లతో పాటు పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసిన ఏకైక సీఎం.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. కుల, మతాలకు అతీతంగా ఇచ్చిన మాట ప్రకారం రూ. 3 వేలు పింఛన్ అందజేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరిట అందినకాడికి దండుకున్నారని తాము పారదర్శకంగా ఠంఛన్‌గా పింఛన్ అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నూతనంగా పింఛన్ మంజూరు అయిన లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బీ దుర్గారావు, వార్డు సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో తెల్లవారుజాము నుంచే పెంచిన పింఛన్లను వలంటీర్లు, వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంఛార్జీ గుండే సుందర్‌పాల్ గురువారం అందజేశారు. డివిజన్‌లో 31 మందికి నూతన పింఛన్లు మంజూరు అయ్యాయని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తున్నామని ఆయన తెలిపారు.

లక్ష్మీనారాయణ లేనిలోటు పూడ్చలేనిది



లక్ష్మీనారాయణకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ లక్ష్మీపతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): న్యాయవాది, గద్దె వెంకట్రామయ్యనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మల్లంపల్లి లక్ష్మీనారాయణ లేని లోటు పూడ్చలేనిదని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మధురానగర్‌కు చెందిన మల్లంపల్లి లక్ష్మీనారాయణ సంస్మరణ కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మల్లంపల్లి ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన సేవలను కొనియాడారు. లక్ష్మీ నారాయణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌కే బాబు, కే సుధాకర్, మల్లంపల్లి రామకోటేశ్వరరావు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

గ్రూప్ –1 ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే పార్థసారథి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, పక్కన తోట శరత్‌చంద్ర

లబ్బీపేట(విజయవాడతూర్పు): బలహీనవర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన వారి కోసం విజయవాడ శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీలో ఉచితంగా ఇస్తున్న ఏపీపీఎస్సీ గ్రూప్–1 శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పెనమలూరు శాసన సభ్యులు కొలుసు పార్థసారథి అన్నారు. గ్రూప్ 1 ఉచిత శిక్షణకు సంబంధించి శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ ముద్రించిన పోస్టర్‌ను గురువారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కోసం నోటిఫికేషన్లు జారీ చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ కూడా గ్రూప్ 1 పరీక్షను సివిల్స్ స్థాయిలో పెట్టడం, నోటిఫికేషన్లను అనుకున్న సమయంలోనే పారదర్శకంగా పూర్తి చేస్తూ, మిగిలిన రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా నిలుస్తుందన్నారు. పెనమలూరు నియోజకవర్గంలోని యువతకు అవసరమైన శిక్షణ తన సొంత ఖర్చుతో ఉచితంగా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. విద్య, వైద్య రంగాల్లో సహాయం చేయడానికి తామెప్పుడు ముందుంటానని పేర్కొన్నారు. అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్ చంద్ర మాట్లాడుతూ తమ అకాడమీలో గత మూడు సంవత్సరాల్లో 98 కిపైగా గ్రూప్ 1 ర్యాంకులు వచ్చినట్లు తెలిపారు. గ్రూప్1 పరీక్ష కూడా ఐఏఎస్ తరహాలో జరుగుతుందని ఆయన తెలిపారు.

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ తిరుపతమ్మ

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ సూచించారు. విలేజీ కండ్రికలో ఎంపీయూపీ పాఠశాలలో 280వ వార్డు సచివాలయం పరిధిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' రెండవ ఫేజ్ వైద్య శిబిరం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి విడత నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అనేక మంది ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారని చెప్పారు. దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండవ దఫా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి ప్రభుత్వం రూ. 5 లక్షల నుంచి 25 లక్షల వరకు వైద్యం కోసం అందిస్తోందని పేర్కొన్నారు. వైద్య శిబిరంలో మొత్తం 450 మంది ఓపీ రాగా వారిలో 150 మందికి వైద్య పరీక్షలు, 50 మందికి ఈసీజీ పరీక్షలు నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ బాసిద్ తెలియజేశారు. జోనల్ కమిషనర్ ఎం. మాల్యాద్రి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ సాయిప్రియాంక, పీడియాట్రిషన్ డాక్టర్ ఖ్యాతి, కంటి వెలుగుకు సంబంధించిన డాక్టర్లు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నిరుద్యోగ యువతకు జనవరి నెలలో స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. కటింగ్ అండ్ టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ, రిఫ్రిజరేషన్ రిపేరింగ్, ఐస్‌క్రీమ్ మేకింగ్, స్క్రీన్ ప్రింటింగ్, జామ్ అండ్ జ్యూస్ తయారు చేయడం, బాతిక్ ప్రింటింగ్, హోమ్ క్రాఫ్ట్స్ మేకింగ్, మిర్రర్ వర్క్ మొదలైన అంశాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866–2470420 నంబరులో కానీ సంప్రదించాలని కోరారు.

ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో మాదిగలకు సమన్యాయం చేయాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న దాసరి సువర్ణ రాజు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎస్సీ రిజర్వుడ్ స్థానాల్లో మాదిగలకు న్యాయం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణ రాజు కోరారు. విజయవాడ ఐలాపురం హోటల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 29 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 15 సీట్లు మాదిగ, మాదిగ ఉప కులాలకు కేటాయించాలని కోరారు. మాదిగల జనాభా ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలను మాలలకు కాకుండా మాదిగలకే కేటాయించాలన్నారు. ఈ ప్రభుత్వంలో సీట్ల కేటాయింపులో మాదిగలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు. మాదిగలు, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈనెల 20వ తేదీన వైఎస్సార్ కడప మున్సిపల్ గ్రౌండ్‌లో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మాదిగల రాజకీయ సమన్యాయ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభకు మాదిగలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు కుందుర్తి సుబ్బారావు, ఎంఈఎఫ్ అధ్యక్షుడు వరదరాజులు జాతీయ నాయకుడు ఏసు పోగు బాబు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మంద నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

● ఐడియా.... అదిరింది...!



చిన్నారి షర్టు జేబుపై ఫోన్ నంబరు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భవానీ దీక్షలలో తల్లిదండ్రుల నుంచి చిన్నారులు తప్పిపోవడం సర్వ సాధారణం... అయితే దసరా ఉత్సవాలలో చిన్నారుల చేతికి పోలీసులు ట్యాగ్ వేసి దానిపై తల్లిదండ్రుల ఫోన్ నెంబర్ వేస్తారు.. అయితే కొన్ని సందర్భాల్లో ఆ ట్యాగ్‌లు చిరిగిపోయే అవకాశం ఉండేది. అయితే గురువారం ఓ తండ్రి తన కుమారుడికి తన ఫోన్ నెంబర్ తెలిసేలా చేసిన ఐడియా అదిరిపోయింది. కుమారుడు షర్టుపై పర్మినెంట్ మార్కర్ ఇంక్‌తో తన ఫోన్ నెంబర్ వేశాడు. కుమారుడు పొరపాటున తప్పిపోయినా... ఎవరికైనా దొరికితే వారి చేత ఈ ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయమని చెప్పాలని ఆ బిడ్డకు చెప్పాడు. ఈ ఐడియా అదిరిపోయిందంటూ తోటి భవానీలు, పోలీసు సిబ్బంది ఆ తండ్రిని మెచ్చుకున్నారు.

తెలుగు సాహిత్యానికి సోమేపల్లి విశేష కృషి



పాలస్తీనా స్వేచ్ఛకై గళమెత్తుదాం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సోమేపల్లి వెంకట సుబ్బయ్య తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేశారని కవి చలపాక ప్రకాష్ కొనియాడారు. విజయవాడ పుస్తకమహోత్సవం ఆవరణలోని కేతు విశ్వనాథ రెడ్డి సాహిత్యవేదికపై సోమేపల్లి వెంకట సుబ్బయ్య సంస్మరణ సభ గురువారం జరిగింది. ప్రకాష్ మాట్లాడుతూ కవిగా తన సాహిత్య ప్రయాణాన్ని ప్రారంభించి, సంపాదకుడుగా సోమేపల్లి వెంకటసుబ్బయ్య తెలుగు యువ కవులకు అండగా నిలిచారని తెలిపారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సంస్థ అధ్యక్షుడు గోళ్ళ నారాయణరావు, పుస్తకమహోత్సవ సంఘం అధ్యక్షుడు మనోహర్ నాయుడు, సభ్యులు బోడి ఆంజనేయరాజు, శ్రీవశిష్ఠ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై వాస్తవాలను ప్రజలు తెలుసుకోవాలి...

ప్రపంచంలో అమెరికా చేస్తున్న దురాగతాల గురించి తెలుసుకోవాలంటే ప్రజలంతా పాలస్తీనా సమస్యపై వాస్తవాలు తెలుసుకోవాలని సాహితీవేత్త బుడ్డిగ జమీందార్ అన్నారు. ఎన్.వేణుగోపాల్ రాసిన పాలస్తీనా స్వేచ్ఛకై గళమెత్తుదాం, సీఏస్సార్ ప్రసాద్ రాసిన మండిస్తూ మండే గాజా, జేవీ.సత్యనారాయణమూర్తి రాసిన నేల లేని దేశం అనే మూడు పుస్తకాల ఆవిష్కరణ గురువారం పుస్తకమహోత్సవంలో జరిగాయి. ఆవిష్కరణ సభకు అధ్యక్షత వహించిన సందర్భంగా జమీందార్ మాట్లాడుతూ గత మూడున్నర నెలలుగా ఇజ్రాయిల్ పాలస్తీనాల మధ్య జరుగుతున్న ఘోర యుద్ధంపై మేధావుల అభిప్రాయాలను ఈ పుస్తకాలు రికార్డు చేసి ప్రజల ముందుకు తెచ్చారన్నారు. భారతీయులంతా పాలస్తీనీయులకు మద్దతివ్వాలని కోరారు.

హిందీలోకి అనువాదాలు పెరగాలి...

తెలుగు భాషలోని పుస్తకాలు ఇతర భాషల్లోకి ముఖ్యంగా హిందీలోకి అనువాదాలు జరగాలని ప్రముఖ రచయిత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చెప్పారు. పుస్తకమహోత్సవం సాహిత్య అకాడమీ అవార్డు పొందిన దేవీప్రియ తెలుగు కవిత్వం 'గాలి రంగు' పుస్తకానికి హిందీ అనువాదం 'హవా కా రంగ్' పుస్తకాన్ని గురువారం సాయంత్రం పుస్తక మహోత్సవం ఆవరణలో లక్ష్మీప్రసాద్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగులో జరుగుతున్న అద్భుతమైన సాహిత్య సృష్టిని దేశమంతటికీ చేర్చాల్సిన బాధ్యత కూడా తెలుగువాళ్లే తీసుకోవాలన్నారు. హిందీ అకాడమీ అధ్యక్షుడు పేరిశెట్టి శ్రీనివాసరావు కవిత్వం తీరుతెన్నులు, భారతీయ కవిత్వంలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. కవి బండ్ల మాధవరావు సభకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వెన్నా వల్లభరావు, కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.



పుస్తకాలను తిలకిస్తున్న ప్రజలు

ఉచిత యోగా శిక్షణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ రాజీవ్‌గాంధీ వీధిలోని స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ కార్యాలయంలో ప్రతీ ఆదివారం ఉచిత యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకుడు సీహెచ్ నారాయణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ ఆదివారం ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు ఉచితంగా యోగాసన, ప్రాణాయామ, ధ్యానం శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.